ప్రజాశక్తి
శుక్రవారం 2 డిసెంబర్ 2022




## నేడు జిల్లాకు మంత్రి బొత్స రాక

ప్రజాశక్తి-విజయనగరం

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు నగరంలోని తన నివాసానికి మంత్రి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు గుర్ల మండలం నాగళ్లవలసలో ఆర్‌టిసి బస్సు సర్వీసును ప్రారంభిస్తారు. 11 గంటలకు శ్రీకాకుళం చేరుకొని పార్టీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విజయనగరంలోని అంబటిసత్రం వద్ద ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలతో గజపతినగరం ఎమ్మెల్యే నివాసంలో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటలకు ఎస్ కన్వెన్షన్‌లో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి కుమారుని వివాహ వేడుకలో పాల్గొంటారు. 3న నగరంలోని మెట్రో ఫంక్షన్ హాల్, జగన్నాథ ఫంక్షన్ హాల్లో జరిగే వివాహాలకు మంత్రి హాజరు కానున్నారు.

అసలే చిన్న, సన్నకారు రైతులు.. ఆపై అధిక పెట్టుబడులు.. నిబంధనల పేరిట బ్యాంకుల సహాయ నిరాకరణ... పండిన పంటకు గిట్టుబాటు ధరలేక, మార్కెట్ సదుపాయమూ దొరక్క దళారుల వలలో చిక్కుకోవాల్సిన దుస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకుంటున్నామంటూ అమలు చేస్తున్న పిఎం కిసాన్ యోజన పథకం వేలాది మంది రైతుల దరిచేరడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగిపోయేలా తిరిగినా ఫలితం కనిపించడం లేదు. ఇటువంటి పరిస్థితి ఒకరిద్దరిది కాదు. అక్షరాల ఐదు వేల మూడు వందల యాభై ఒక్క రైతు కుటుంబాల దుస్థితి.

# ఎగసాయం

- 5 వేల మందికి అందని కిసాన్ యోజన
- బ్యాంకు ఖాతాలు ఇన్ యాక్టివేట్ పేరిట 3,200 మందికి ఎగనామం
- ఆధార్ లింకు కాలేదని 1104 మందికి సాకులు
- ఆదాయపన్ను పరిధిలో ఉన్నారని మరికొందరికి
- ప్రభుత్వ ఆదాయం పొందుతున్నారంటూ ఇంకొందరికి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

భూమి ఉన్న ప్రతి రైతుకూ పిఎం కిసాన్ యోజన పథకం ద్వారా ఏడాదికి రూ.6 వేలు చొప్పున పంటల సాయం అందిస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న విషయం విదితమే. అదీ ఒక్క విడతలో కాదు సుమా..! ప్రతీ నాలుగు నెలలకు రూ.2 వేల చొప్పున మూడు విడతలుగా అందించి, దీన్నే పంటల సాయంగా చెప్పుకుంటోంది. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లోకే జమచేస్తున్నప్పటికీ అర్హులందరికీ అందకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 2,49,538 మంది రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులే అధికం. వీరిలో సుమారు 5,351 మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఈ మేరకు గడిచిన అక్టోబర్‌లో విడుదల చేసిన రూ.2 వేల మొత్తం ఆయా రైతుల ఖాతాల్లో జమకాలేదు. ఇందులో అత్యధికంగా 3,200మందికి బ్యాంకు అకౌంట్లు ఇన్‌యాక్టివ్‌గా ఉన్నాయంటూ సాకులు చెబుతున్న ప్రభుత్వం వారి అప్రమత్తం చేయడం లేదా ప్రత్యామ్నాయం చూపడం వంటి చర్యలు చేపట్టలేదు. మరో 1104మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదని, ఆధార్‌లో తప్పులు సరిచేసుకున్నవారు అప్‌డేట్ చేసుకోలేదని చెబుతున్నారు. ఇంకో 993 మంది భూమి లేని రైతులు కూడా ఉన్నట్టు అధికారులు తమ నివేదికల్లో పేర్కొన్నారు. దీన్నిబట్టి కౌలుదారులకు ఎగనామం పెట్టారని స్పష్టంగానే అర్థమౌతోంది. ఆదాయ పన్ను పరిధిలో ఉన్నందుకు 37మంది, ప్రభుత్వం ద్వారా ఉపాధి పొందుతున్నందుకు 10మందికి పథకాన్ని నిలిపివేశారు. అన్‌సర్వే పేరుతోనూ మరో ఏడుగురు పిఎం కిసాన్ పథకానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో రూ.2 వేల సాయం కోసం ఎదురు చూసిన రైతు కుటుంబాలు తీవ్రంగా కలత చెందుతున్నాయి.

**రైతుభరోసాకూ..**

రైతు భరోసా పథకం అమల్లోనూ ఈ పరిస్థితి పునరావృతం కాదన్న గ్యారెంటీ కనిపించడం లేదు. ఈ పథకం వర్తింపజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇకెవైసి తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మొత్తం రైతుల్లో ఇప్పటి వరకు 1,66,671 మంది రైతులకు మాత్రమే ఇకెవైసి పూర్తయింది. మిగిలిన 82,866 మందిలో సుమారు 40 వేల మంది రైతుల ఆచూకీ దొరకనట్టుగా గుర్తించారు. మిగిలిన వారిలో కొంతమందికి సాగుభూమి లేనట్టు, అనర్హతలు ఉన్నట్టుగా అధికార యంత్రాంగం గుర్తించింది. ఓ వైపు పంటల సాగుకోసం చేసిన ప్రయివేటు అప్పులు తీర్చుకోలేక, వడ్డీలు చెల్లించుకోలేక, వరి, మొక్కజొన్న, పత్తి వంటివాటికి కనీస మద్దతు ధర సరిపోక సతమతమౌతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్న చందంగా మారింది.

## విజయనగర కీర్తి.. విశ్వవ్యాప్తి

### కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో అనిల్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత నెల 24 నుంచి 30 వరకు న్యూజిలాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బొండపల్లి మండలం చామలవలసకు చెందిన బోదంకి అనిల్‌కుమార్ ఓవరాల్ గోల్డ్‌మెడల్ సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో విజయనగరం కీర్తిని చాటాడు. అనిల్ నాలుగేళ్లుగా రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ స్ట్రాంగ్‌మేన్ అవార్డు కూడా పొందాడు. విశాఖపట్నంలోని బుల్లయ్య కళాశాలలో బిఎస్‌సి చదువుతున్నప్పటి నుంచి కళాశాల కోచ్ శ్రీనివాస్ ఆధ్వర్యాన సాధన మొదలు పెట్టాడు. కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రాష్ట్రం నుంచి ఏడుగురు, దేశ వ్యాప్తంగా సుమారు 100 మంది పాల్గొన్నారు. 56 దేశాల నుంచి పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన అనిల్ కుమార్ విజయం సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు.



పతకాలతో అనిల్

## యువ ఓటర్ల నమోదుపై దృష్టి

### కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 18, 19 సంవత్సరాల వయస్సులోని యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడంపై దృష్టిసారిస్తున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో చదువుతున్న యువతను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆయా విద్యాసంస్థల వద్ద ఉన్న విద్యార్థుల వివరాల ఆధారంగా 18 ఏళ్లు నిండి ఓటర్లుగా నమోదుకాని వారందరినీ పెద్ద ఎత్తున ఓటర్లుగా నమోదు చేయించే ప్రయత్నం చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాతో కలిసి కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ కమిషనర్ నితేష్ వ్యాస్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై గురువారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఉన్నత విద్యాసంస్థల్లో విద్యావంతులైన యువత అధికంగా ఉంటారని తెలిపారు. వారిని ఓటర్లుగా నమోదు చేసేలా వ్యూహాలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డుల పంపిణీని ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిఇఒ ముఖేష్ కుమార్ మీనా సూచించారు.

వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సూర్యకుమారి, జెసి మయూర్ అశోక్, ఉన్నతాధికారులు

ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు, సిఐటియు నాయకులు

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో గురువారం అలజంగి గ్రామంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని రద్దు చేయాలని ఆలోచనలతో ప్రభుత్వం ఉందన్నారు. అందుకే సంక్షేమ బోర్డు ద్వారా ఎటువంటి సంక్షేమ పథకాలూ అమలు చేయవద్దని ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చాక సంక్షేమ బోర్డు ద్వారా కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయకుండా భవన నిర్మాణ కార్మికులకు ద్రోహం చేస్తోందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆ సంఘం మండల అధ్యక్షులు ఎ.ఆచారి, బి.శంకర్రావు హెచ్చరించారు. కార్మిక శాఖ ద్వారా వెల్ఫేర్ బోర్డు పథకాలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## అవగాహన పెంచుకుందాం.. ఎయిడ్స్ తరిమికొడదాం

### సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

సంపూర్ణ అవగాహన పెంచుకోవడం ద్వారానే ఎయిడ్స్‌ని తరిమికొట్టగలమని సీనియర్ సివిల్ జడ్జి బి.హెచ్.వి లక్ష్మీకుమారి పేర్కొన్నారు. కొత్తపేటలోని యుపిహెచ్‌సిలో ఎయిడ్స్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఎయిడ్స్ బాధితులు ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యల వల్ల ప్రజల్లో విస్తృత అవగాహన కలిగి ఎయిడ్స్ తగ్గుముఖం పట్టిందని డిఎంహెచ్ఒ ఎస్.వి. రమణకుమారి అన్నారు. మానసికంగా దృఢంగా ఉండటం వల్ల ఎయిడ్స్ బారి నుంచి తప్పించుకోవచ్చని ఆర్‌టిఒ ఆదినారాయణ తెలిపారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ నాటిక ప్రదర్శించారు. అనంతరం వివిధ పాఠశాలలు, సంస్థల నుంచి వచ్చిన పిల్లలకు నిర్వాహకులు పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా అందజేశారు. జిల్లా యువజన అధికారి విక్రమాధిత్య, అదనపు డిఎంహెచ్ఒ, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి రామేశ్వరి ప్రభు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీకుమారి

## ఘంటసాల శతజయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఘంటసాల శత జయంతి ఉత్సవాల పోస్టర్‌ను గురువారం స్థానిక ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు భీష్మారావు నివాసంలో సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా భీష్మారావు, అధ్యక్షులు గ్రంథి విష్ణుమూర్తి, కార్యదర్శి మేకా కాశీవిశ్వేశ్వరుడు , కోశాధికారి వైవివి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 4న ఘటసాల శత జయంతిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత దర్శకులు సాలూరు రాజేశ్వరరావు కుమారుడు సాలూరు వాసుదేవరావుకు స్వర్ణకంకణం బహూకరించనున్నట్లు చెప్పారు. ఆనంద గజపతి కళాక్షేత్రంలో నిర్విరామ సంగీత స్వరార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నెలకే నాణ్యత పోయింది

ఈ చిత్రంలో రహదారిని చూశారా?. విశాఖ నుంచి అరకు వెళ్లే ప్రధానమార్గమిది. నెల రోజుల క్రితమే ఈ రహదారి వేశారు. రహదారి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడంతో ఇదిగో ఇలా తయారైంది. అధికారుల పర్యవేక్షణా లోపమా? కాసుల కక్కుర్తో? ఏమో గానీ నాణ్యత నెలరోజులకే కొట్టుకుపోయింది. వేపాడ మండలంలోని బొద్దాం నుంచి కొత్తబొద్దాం వరకు సుమారు కిలోమీటరు మేర ఇలా అధ్వానంగా తయారైంది. రోడ్డంతా పెచ్చులూడిపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

\- ప్రజాశక్తి, వేపాడ

భారీగా పెచ్చులూడిన రోడ్డు

## అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ దర్యాప్తు

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు శాఖ పట్టణ ఎఇ బి.సాంబశివరావు విద్యుత్తు లైన్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఎస్‌టియు జిల్లా నాయకులు కె.జోగారావు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేశారు. సాయిసర్వాణి లేఅవుట్లో వీధి దీపాలు వేసేందుకు విద్యుత్తు లైన్ కోసం లంచం ఇవ్వాలని ఎఇ సాంబశివరావు డిమాండ్ చేసినట్లు జోగారావు ఆరోపించారు. దీంతో విజిలెన్స్ అధికారులు సిఐ కృష్ణ, ఎస్ఐలు ప్రభాకర్, డిడి నాయుడు దర్యాప్తు చేశారు. జోగారావుతో రాత పూర్వకంగా ఫిర్యాదు తీసుకున్నారు. దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విజిలెన్స్ అధికారులు చెప్పారు. వీధి దీపాల లైన్ బాధ్యత మున్సిపల్ అధికారులు చూస్తారని, తాను లంచం అడగలేదని ఎఇ సాంబశివరావు వివరణ ఇచ్చారు.

విచారణ చేపడుతున్న విజిలెన్స్ అధికారులు



విద్యార్థులను అభినందిస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

## వెయిట్‌లిఫ్టింగ్‌లో సత్తాచాటిన 'సత్య' విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన తొమ్మిదో యూత్ జూనియర్, సీనియర్ ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ - 2022లో సత్య కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్.పల్లవి బంగారు, రెండో సంవత్సరం విద్యార్థి ఆర్.రాంబాబు కాంస్య పతకాలు సాధించారు. అందరికన్నా ఎక్కువ బరువు (216 కిలోలు) ఎత్తినందుకు పల్లవి స్ట్రాంగ్ ఉమెన్ అవార్డును కైవసం చేసుకుందని కోచ్ చల్లా రాము తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు వారిని అభినందిస్తూ నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి సాయి దేవమణి, కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్య వేణి, ప్రకాష్ సిల్క్స్ అధినేత యు.ప్రకాశరావు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి 'రౌండ్‌టేబుల్' కృషి

**విజయనగరం టౌన్ :** విద్యాభివృద్ధి కోసం రౌండ్‌టేబుల్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ అల్లు చాణిక్య కొనియాడారు. రౌండ్ టేబుల్ సంస్థ ప్రచారంలో భాగంగా గురువారం కొత్తపేట గోకుల్ పార్క్ వద్దకు చేరుకున్న ఫ్రీడమ్ డ్రైవ్ వాహనాలను వారు జెండా ఊపి ప్రారంభించారు. ఆ సంస్థ ఆధ్వర్యాన చేపట్టిన దేశవ్యాప్త యాత్ర కోల్‌కతా నుంచి రాంచి వరకు సాగుతుంది. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ విజయ్ మాట్లాడుతూ యువతకు సంపూర్ణ విద్యను అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఇసరపు రామకృష్ణ, సంస్థ పాస్ట్ చైర్మన్ కార్తీక్, కార్యదర్శి నటరాజ్, ప్రోగ్రాం చైర్మన్ శ్రీనివాస్, సురేంద్ర పాల్గొన్నారు.

## గడపగడపకు సంక్షేమ పథకాలు

### డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

గడపగడపకు సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. ఏ గడపకు వెళ్లి అడిగినా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గురువారం మండలంలోని రంగరాయపురం, చల్లారపువలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని తెలిపే కరపత్రాలను చూపిస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గత మూడేళ్లలో రంగరాయపురం గ్రామస్తులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 14.32 కోట్ల రూపాయలు అందాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల రామసుధీర్, నాయకులు గేదెల సత్యనారాయణ, కోట గోవింద, కొప్పుర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

### రెండో డివిజన్‌లో గడపగడపకు..

**విజయనగరంటౌన్ :** నగరంలోని రెండో డివిజన్లో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్ బండారు ఆనందరావు, వైసిపి పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, వజ్రపు శ్రీను పాల్గొన్నారు.

## కనక మహాలక్ష్మి ఆలయ సన్నిధిలో కోలగట్ల

నగరంలోని సిటీ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న కనకమహాలక్ష్మి ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం సందర్శించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలను సమర్పించారు.

## ఎంఎల్ఎస్ గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు

గోదాముల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని ఎంఎల్ఎస్ గోదాములు, బఫర్ గోడౌన్లను పౌర సరఫరాల అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు, ఆ శాఖ విజిలెన్స్ డిసి నారదముని, ఎఫ్‌సిఐ మేనేజర్ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. దీనిలో భాగంగా విజయనగరం ఎంఎల్ఎస్ పాయింట్‌ను, కెఎల్‌పురంలోని బఫర్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. స్టాకు రికార్డులను, నాణ్యతను పరిశీలించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి మధుసూదనరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ మీనాకుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**IN THE COURT OF THE VTH JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT :: HYDERABAD TELANGANA**

O.S.No. 2005 OF 2020

BETWEEN:

M/s. Aurobindo Pharma Ltd.
....Plaintiff

AND

G. Trivikram and Others.
....Defendants

To,
1.Y. Govindarao Naidu S/o. Y. Sathyam R/o. H.No. 8-63.B, Cheepurupalli - Street, Bobbili, Vizainagaram, A.P. - 535558.
.... Defendant No.3

Whereas the Plaintiff Company filed the above suit against you for recovery of damages/money. The above suit is posted to **09.12.2022** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with you defense if any at **10:30** a.m. on the above said date before the hon'ble Court, failling which the suit will be heard and determined exparte

**(BY ORDER OF THE HON'BLE COURT)**

**K. VENUGOPAL REDDY**
Advocate
# 4-92/2/A, 1st Floor,
Opp. Meeseva & GHMC,
Chandanagar, Hyderabad- 500 050.

## మొక్కలు నాటడం పర్యావరణ సంప్రదాయం

**శృంగవరపుకోట:** గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జిఇఓ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రాంగణంలో జిఇఓ వ్యవస్థాపకులు బి.రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఫల, పుష్ప జాతి రకాల పలు మొక్కలను గురువారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజున పది మొక్కలు నాటడం మంచి పర్యావరణ సంప్రదాయమని, అందరూ పాటిద్దామని అన్నారు. సిమ్ డైరెక్టర్ వై. విజయలక్ష్మి, సీనియర్ పాత్రికేయులు జి.సత్యసాయి, న్యాయవాది యమ్.అనూరాధ దంపతులు, హృషికేష్, రామ్‌కృష్ణ పాల్గొన్నారు.

## బహుజన కళామండలి కరపత్రం ఆవిష్కరణ

**వేపాడ:** ఈ నెల 3న విజయవాడ మాకినేని బసవపున్నయ్య భవనంలో జరగనున్న 25వ బహుజన కళామండలి మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు ఆవిష్కరించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డప్పు రాజు, ఎ. నాగరాజు, సిహెచ్ సూరరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నైపుణ్యం అవసరం

**శృంగవరపుకోట:** విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్యం కూడా అవసరమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని చినఖండేపల్లి గ్రామం కేంద్రంగా సేవలందిస్తున్న సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఎస్.కోట ప్రభుత్వ కళాశాల గిరిజన బాలుర వసతి గృహం విద్యార్థులకు గురువారం పుస్తక పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ మండలంలో విద్య, వైద్యం, అక్షర సేవలు అందిస్తుండటం అద్భుతంగా భావించాలన్నారు. పేదలకు అన్నదానం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న పేద గిరిజన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ హర్షించదగ్గవన్నారు. అనంతరం సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ సమకూర్చిన పుస్తకాలను వసతి గృహం విద్యార్థులకు పంపిణీ చేశారు. స్వయంగా వసతి గృహం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించి వారితో కలిసి తిన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ప్రతినిధి రఘువర్మ, వసతి గృహం సంక్షేమ అధికారిణి శాంతి, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సూరిబాబుకు స్కౌట్ నేషనల్ సర్టిఫికెట్

**నెల్లిమర్ల:** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ ట్రైనింగ్‌లో హెచ్‌డబ్ల్యు (హిమాలయ వుడ్ బ్యాడ్జ్) సర్టిఫికెట్‌ను విజయనగరం ఫూల్‌బాగ్ నందు స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రం వద్ద డిప్యూటీ డిఇఒ కె. వాసుదేవరావ్, సాహిత్య వేత్త మాజీ ఎంపి డాక్టర్ డివిజి శంకర్రావు చేతుల మీదుగా నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన శ్రీ ఆదిత్య విద్యాలయం కరస్పాండెంట్ స్కౌట్ మాస్టర్ డాక్టర్ వి. సూరిబాబు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కౌట్ కార్యదర్శి వి. చిన్నంనాయుడు, చీఫ్ కమిషనర్ విజయకుమార్, డిఒసి త్రినాథ్ నాయుడు, ఎఎస్ఒ దుర్గా, నాగేశ్వరరావు, స్కౌట్ మాస్టర్స్ ప్రవీణ్ మనోహర్ సహా స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రికవరీలు శతశాతం సాధించాలి

**గరివిడి:** స్థానిక మండల సమైక్య కార్యాలయంలో గురువారం గరివిడి ఏరియా కోఆర్డినేటర్ జి. సీత రామయ్య అధ్యక్షతన గరివిడి క్లస్టర్ స్థాయిలో గరివిడి, చీపురుపల్లి, మెరక ముడిదాం, గుర్ల, నెల్లిమర్ల ఏపిఎంలు, సిసిలతో ప్రాజెక్టు ప్రాధాన్యత అంశాలైన స్త్రీనిధి, ఉన్నతి బ్యాంక్ లింకేజ్, వైయస్సార్ చేయూత, వైయస్సార్ ఆసరా, జీవనోపాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. సావిత్రి మాట్లాడుతూ పై అంశాలు అన్ని సక్రమంగా చేస్తూ శత శాతం పూర్తి చేయాలని ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రస్తుతం మూడవ విడత వైయస్సార్ ఆసరా నిమిత్తం ప్రతి సభ్యురాలు బయోమెట్రిక్ తీసుకోవాలని ఈనెల 15వ తేదీలోగా 100 పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఏజిఎం ఉమామహేశ్వరరావు, స్త్రీనిధి మేనేజర్ ఎర్రి నాయుడు, ఏపిఎంలు ఎల్.పద్మ, సిసిలు పాల్గొన్నారు.

## ఎస్ఐ మురళికి అభినందనలు

**గరివిడి:** మండలంలో గడబవలస, దుగ్గివలస, అప్పన్నవలస గ్రామాల విద్యార్థులు గరివిడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళికి అభినందనలు తెలిపారు. గత కొంతకాలంగా ఆ మూడు గ్రామాల విద్యార్థులు చదువుకోవడానికి విజయనగరం, చీపురుపల్లి, రాజాం, శ్రీకాకుళం పాఠశాలలు, కళాశాలలకు వెళ్ళాలి అంటే అప్పన్నవలస సెంటర్లో బస్సు, ఆటో కోసం ఆగి మారాల్సిందే. ఆ సమయంలో పాలకొండ నుంచి విజయనగరానికి వెళ్లే వాహనాలు ఆపకుండా వేగంగా వెళుతున్నాయని దీంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యార్థులు ఎస్ఐ మురళికి చెప్పడంతో ఆయన వెంటనే స్పందించి అప్పన్నవలస సెంటర్లో ట్రాఫిక్ సేఫ్టీ గేట్స్ పెట్టించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## పెదనడిపల్లిలో వైద్య శిబిరం

**గరివిడి:** చీపురుపల్లి మండలం పెదనడిపల్లి గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వైసిపి అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తాత, తల్లి స్మృత్యర్థం మన్నె సూర్యం, మన్నె జయలక్ష్మి జ్ఞాపకార్థం అనిల్ నీరుకొండ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుని చీపురుపల్లి జెడ్పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఎఎంసి చైర్మన్ దన్నాన జనార్దన్ ప్రారంభించారు. ఈ మెడికల్ క్యాంపులో అనిల్ నీరుకొండ హాస్పిటల్ డాక్టర్ సుజిత్ కుమార్, డాక్టర్ సాయిరాం, డాక్టర్ ప్రవల్లిక, ఇఎంటి శ్యామ్‌ప్రీత్, గణేష్‌లు 500 మంది రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన రోగులకు అనిల్ నీరు కొండ హాస్పిటల్లో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. వారికి పెదనడిపల్లి గ్రామం నుంచి బస్సు సౌకర్యం కూడా కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ రాజ్, ఎంపిటిసి ఆదినారాయణ, వలిరెడ్డి రవీంద్రనాయుడు, పద్మ, అబ్బు, ప్రభాత్, శేఖర్ గుప్త, చిన్ని పేకాప్ ప్రసాద్, మొండెటి కిషోర్, పిఆర్ఒ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళలకు పింఛన్లు పంపిణీ

**గరివిడి:** చీపురుపల్లి మండలం పెదనడిపల్లి గ్రామంలో డ్వాక్రా గ్రూపులో వున్న మహిళలకు వైయస్సార్ క్రాంతి పథం ద్వారా అభయ హస్తం పెంఛన్ రూ.500 చొప్పున సూర పాపమ్మ, ఎస్. పైడమ్మలకు మంజూరయ్యాయి. ఈ పింఛను నగదును జెడ్పిటిసి వలిరెడ్డి శిరీష, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్దన చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పిసిని శ్రీనివాసరావు, సర్పంచ్ పోలరాజు, ఎంపిటిసి ఆదినారాయణ గడిరాజునాయుడు, ప్రభాత్, పంచాయతీ కార్యదర్శి అశోక్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు పోలీసుల వితరణ

**కొత్తవలస:** ఆంజనేయ పేటలో ఉన్న చైతన్య మానసిక వికలాంగుల ఆశ్రమంలో గురువారం మానసిక వికలాంగులకు విజయనగరం జిల్లా పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన దండు మారెమ్మతల్లి 1990 సంవత్సరం 53వ బ్యాచ్ సభ్యులు 32 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సుమారు రూ.10 వేల రూపాయలు ఖర్చుతో మానసిక వికలాంగులకు అన్నదానం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. సభ్యులు కుటుంబ సభ్యులతో వికలాంగ పిల్లలతో గడిపారు. ఈ కార్యక్రమంలో బ్యాచ్ తరుపున ఎఎస్ఐ జె. కృష్ణ దంపతులు, హెడ్ కానిస్టేబుల్ ఎం.ప్రసాదరావు, ఎ.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసరావు, ఈశ్వరరావు దంపతులు, పి.నీలకంటేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపకులు బొజంకి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని త్రినిటే చారిటబుల్ ట్రస్ట్ లో 35 మంది అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**భోగాపురం:** కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని భోగాపురం తాలూకా ఎపి ఎన్‌జిఒ అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో పాటు ప్రతీ నెలా జీతాలు అందక పోవడం వంటి సమస్యలతో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సతమతమవుతున్నారని చెప్పారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గురువారం మధ్యాహ్నం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోవచ్చునన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఎపి ఎన్‌జిఒ సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వైద్య సంఘ ప్రతినిధి ఉదయ్ కుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు

## చెరకు లోడులతో ఇబ్బందులు

**వంగర:** మండలంలోని శివ్వాం, సంగాం, తలగాం తదితర గ్రామాల నుండి రేగిడి మండలంలోని సంకిలిలో గల ఈఐడి షుగర్ ఫ్యాక్టరీకి నిత్యం అధిక లోడులతో చెరుకు ట్రాక్టర్లతో వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇరుకైన రోడ్లలో ట్రాక్టర్ల పై మితిమీరిన లోడ్లు వేసి చెరుకు తరలించడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - వేపాడ**

స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ ఎ. ధరణి ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవ ర్యాలీను గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జివిఆర్ ఆంజనేయులు, హెచ్ఎస్ వెంకటరమణ, హెచ్‌వి కాసులు, ఎం ఎల్‌హెచ్‌టిసిఒ, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశలు పాల్గొన్నారు.

**గజపతినగరం:** ఎయిడ్స్‌పై అవగాహన అవసరమని మరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో

కొత్తవలస: సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సూర్యకిరణ్‌శ్రీ

భాగంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**శృంగవరపుకోట:** ఎయిడ్స్ సోకిన వారు భయపడకుండా సక్రమం గా మందులు వాడితే నివారణ కలుగుతుందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్య శేఖర్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆసుపత్రి నుండి దేవి జంక్షన్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, ఐసిటిసి కౌన్సిలర్ ఎం సత్యనారాయణ, సత్యహరి, జీవన్ జ్యోతి వెల్ఫేర్ అసోసియేషన్ నాగూర్ భాష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**జామి:** స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ భాగ్య రేఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీని గురువారం పిహెచ్‌సి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్ఐ ఎస్. ఐ వీరబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, ఎఎన్ఎంలు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మెంటాడ:** ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా గురువారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి శృతి ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస:** ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్య కిరణ్‌శ్రీ అన్నారు. కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎం.శృతి, సీతాలక్ష్మి, స్థానిక ఎస్.ఐ. బి.దేవి, సీనియర్ అడ్వకేట్ ఎంవిఎస్. గిరిబాబు, డి. శ్రీనివాస్, సిహెచ్ఒ ఇ.కృప, ఎంపిహెచ్ఇఒ వెంకటనాయుడు, సూపర్ వైజర్ లు సూర్య దేముడు, బేబీ రాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

**గరివిడి:** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా చీపురుపల్లి మండలం పెదనడిపల్లి హెల్త్ సబ్ సెంటర్ ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసునాయుడుచడం, పిసిని శ్రీను, సర్పంచ్ పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోట: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

**దత్తిరాజేరు:** మండల కేంద్రంలో గురువారం కస్తూరిబా బాలికల విద్యాలయంలో రూరల్ డవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిడబ్ల్యుఎస్ డైరెక్టర్ ఊహ మహంతి, కార్యదర్శి సురేష్ మహంతి, కెజిబివి ప్రత్యేకాధికారి శివ పద్మ, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొలుగోలు కేంద్రాలేవి..?

- సర్వసభ్య సమావేశంలో నిదీసిన సభ్యులు
- బయట పడ్డ సమన్వయ లోపం

**ప్రజాశక్తి- డెంకాడ**

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు గగ్గోలు పెట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు అధ్యక్షతన బడ్జెట్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నిర్మల వ్యవసాయ శాఖ పై తన నివేదికను చెప్తుండగా సభ్యులు అందరూ ఒక్కసారిగా లేచి ముందు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలం లోని చొల్లంగిపేట, ఢీకొల్లం, ఆర్ ముంగనాపల్లి, కే కొల్లాం గ్రామాల్లోని పొలాల్లో ధాన్యం బస్తాలతో పట్టి పది రోజులుగా ఎదురుచూస్తున్నామని వర్షాలు పడితే తడిసిపోయే ప్రమాదం ఉందని దీనివల్ల రైతుల నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉందని కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనికి ఎఒ స్పందిస్తూ తానొక్కరి వల్ల కాదని మరో

ఎఒ నిర్మలను ప్రశ్నిస్తున్న సభ్యులు, ప్రజాప్రతినిధులు

మూడు శాఖలు కూడా ఉన్నాయని వారు ఎవరు స్పందించకపోవడంతోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేటు అయిందని తెలిపారు. మిల్లర్లు ఇంకా ధాన్యం తీసుకునేందుకు ముందుకు రాలేదని చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు కావడం లేదని దీనంతటికీ ఇంజనీరింగ్ అధికారులే కారణమని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పనులు చేశామని వాటికి బిల్లులు అవ్వక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సమావేశంలో సభ్యుల అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పలేక దాట వేశారు. అనంతరం 2022-23, 2023-24 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

**సమన్వయ లోపం**

గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం చూస్తే అధికారులకు ప్రజాప్రతినిధులకు సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఇంజనీరింగ్ అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన పనులకు తమ వరకూ ఎం బుక్కు చేసి బిల్లులు పెట్టామని బిల్లులు అవ్వకపోతే దానికి తామేమి చేస్తామని చెప్పడంతో వారి మధ్య సమన్వయం లేదని తేటతెల్లమైంది. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు పిన్నింటి తమ్మి నాయుడు, కూరాకుల అనిత, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోగికి ఎమ్మెల్సీ పరామర్శ

**నెల్లిమర్ల :** మండలంలోని తంగుడుబిల్లి గ్రామ వాలంటీరు పొదిలాపు శ్రీనివాసరావు కుమారుడు చరణ్ (12) బ్రెయిన్ ట్యూమర్‌తో భాదపతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు గురువారం ఆ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను, తీసుకుంటున్న వైద్యం వివరాలను తెలుసుకున్నారు. వాలంటీర్ శ్రీనివాసరావు కుమారుడి ఆరోగ్యం బాగు పడుతుందని ఆ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఏ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

# రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి - గజపతినగరం**

రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. పిఎస్ఆర్ పురంలో గురువారం జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థకు తావు లేకుండా కొత్త విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. రైతుల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వమే ఆర్‌బికెల ద్వారా కొంటుందని అన్నారు. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని రైతు భరోసా కింద ప్రతి రైతుకు రూ.13,500 అందిస్తున్నామని చెప్పారు. రూ. 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధితో రైతులను ఆదుకుంటున్నామన్నారు. ధాన్యంలో తేమ శాతంతో మిల్లర్ల నుండి రైతులు పడే ఇబ్బందులను గుర్తించి ఆ గ్రామ ఆర్‌బికెలోనే రోజుకు 10 శాంపిల్స్ తీసి పరీక్షించి చెప్పడం జరుగుతుందని అన్నారు. ప్రతి రైతుకు రెండు తార్పాన్లు అందించి వాటిపై ధాన్యాన్ని ఆరబెడితే తేమ శాతం తగ్గి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. పిఎసిఎస్ ద్వారా గోనె సంచులను రైతుకు అందజేస్తున్నామని రైతు పండించిన పంట డబ్బులను, రైతు ఖర్చయ్యే హమాలీ ఖర్చులను కలిపి వారి అకౌంట్లోనే వేస్తామని చెప్పారు. శరవేగంగా జరుగుతున్న పోలవరం కాలువ నిర్మాణం వల్ల భవిష్యత్తులో రబీ

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స

కూడా పండించే అవకాశాలు ఉన్నందున ముందస్తు ప్రణాళికగా 500 టన్నుల వరకు నిల్వ చేసే సామర్థ్యం ఉన్న గోడౌన్లను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడి ఎ రామారావు, జిల్లా పౌర సరఫరా శాఖ మేనేజర్ మీనాకుమారి, ఎఎంసి చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, సర్పంచ్ కామినాయుడు, బెల్లాన త్రినాథ రావు, కె. పైడుపునాయుడు, వైసిపి నాయకులు మండల సురేష్, లెంక గణేష్, ఎడిఎ మహారాజన్, ఎంఎఒ సిహెచ్ ధనలక్ష్మి, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ నిరోధకతపై అవగాహన

**ప్రజాశక్తి- గరివిడి**

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం ర్యాగింగ్ నిరోధకతపై కాలేజీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి డిఎస్‌పి బి. మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, జూనియర్లకు సీనియర్లు మార్గదర్శకంగా ఉండాలిని తెలిపారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే జరిగే నష్టాలు వివరిస్తూ, ఎపి ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్ -1997, పోక్స్-2012 వంటి చట్టాల ద్వారా కనీసం 6 నెలలు నుండి జీవితాంతం జైలుశిక్ష పడే చట్టాలు ఉన్నాయని అవగాహన కల్పించారు. ఫేక్‌లోన్ యాప్స్, ఫేక్ లింక్స్, ఫేక్ బిజినెస్ యాప్స్ ద్వారా మోసపోయి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ జి. సంజీవరావు, ప్రిన్సిపల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏవో జి.అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎస్.సత్యం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, పాల్గొన్నారు.

**నెల్లిమర్ల :** విద్యార్థులు సామాజిక, సంఘ వ్యతిరేక ఘటనల పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ పి. నారాయణరావు అన్నారు. గురువారం ఆయన తంగుడుబిల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్, దిశ, పోక్సో, లైంగిక దాడులు, యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచుకొని దాడులు ఎదుర్కోవాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడ రాదని, మాదక ద్రవ్యాల వినియోగం జీవితాలను నాశనం చేసి భవిష్యత్ లేకుండా చేస్తుందని అన్నారు. బాలికలు, మహిళలకు రక్షణగా ప్రభుత్వం దిశ, పోక్సో చట్టం తీసుకు వచ్చిందన్నారు. దాడులు జరిగే క్రమంలో భయపడకుండా పోలీసులకు సమాచారమిస్తే వెంటనే వస్తారని తెలిపారు.

# ధాన్యం కొనుగోలుపై అవగాహన

**ప్రజాశక్తి - వేపాడ**

మండలంలోని జాకేరు గ్రామ సచివాలయంలో రైతులకు, సిబ్బందికి ఎంపిపి దొగ్గ సత్యవంతుడు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, నాయకులు అప్పలనాయుడు, ఎంపడిఒ బిఎస్ఎన్‌కె పట్నాయక్, ఎఒ యశ్వంత్, సచివాలయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

**బానాదిలో..**

బానాది రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై ఎంపిపి సత్యవంతుడు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కర్రీ యశోద, ఎంపిఇసి గొంప తులసి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**రేగిడి :** గ్రామాల్లో ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసి, మిల్లర్లకు పంపించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ కాశీ విశ్వనాథ రావు సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బంది, ఆర్‌బికె వ్యవసాయ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్లాల్లోకి వెళ్లి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని, ప్రభుత్వ నిబంధనల మేరకు తేమగల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. రైతుకు మిల్లర్లకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. గ్రామాల వారీగా ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని చెప్పారు. మండలంలోని సోమరాజుపేట, కోడిస, అంబాడ వెంకటాపురం, కొండల మామిడి వలస, పారంపేట రైస్ మిల్లులు ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలు పరివేక్షణకు తహశీల్దార్, ఎంపిడిఒ, ఎఒ మండల కమిటీగా ఉంటారని చెప్పారు. సమస్యలుంటే కమిటీకి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

# పథకాలు అమలుపై ఆరా

**శృంగవరపుకోట :** మండలంలోని వెంకటరమణ పేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో పాటు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఇంటింటికి వెళ్లి ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రతి గడపలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్థానిక సర్పంచ్ మంచిన రామకోటి, ఎంపిటిసి రాపర్తి రామచంద్రరావు, పుణ్యగిరి ట్రస్టు చైర్మన్ రామకృష్ణ, తిమిడి ఎంపిటిసి పాదాల ధర్మారావు, ఎస్.కోట మండలం కో-ఆప్షన్ మెంబర్ షేక్ బషీర్, పిఎసిఎస్ చైర్మన్ రాపర్తి వెంకటరమణ, నాయకులు ఆవాల గోపాలకృష్ణ, వై.సత్యనారాయ ణ, ఎస్.సత్యవతి, ఏ.భాస్కర్, రేవళ్ళపాలెం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి కుళాయిలకు నిధులు మంజూరు

**పూసపాటిరేగ :** గ్రామంలో ఇంటింటికి కుళాయి నిధులు మంజూరయ్యాయని కొల్లాయివలస సర్పంచ్ పైడి సుజాత తెలిపారు. గురువారం నీడ్ ఎన్‌జిఒ ఆధ్వర్యంలో కొల్లాయివలస సచివాలయంలో జలజీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికి సురక్షితమైన నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటింటి కుళాయిలను ఇవ్వనున్నట్లు తెలిపారు. సురక్షితమైన తాగునీటితో పాటు పారిశుద్యంపై కూడా ప్రత్యేకశ్రద్ధ ఉండేలా చూడాలని తెలిపారు.

## నేటి నుంచి 'ఇదేం కర్మ'

**వేపాడ :** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు పిలుపు మేరకు శుక్రవారం నుంచి మండలంలో 'ఇదేమి కర్మ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 9.30గంటలకు ఎస్‌కోట గ్రామం నుండి ప్రారంభిస్తామన్నారు. ఇందులో భాగంగా ముందు ఎస్‌కోట సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి సమావేశం ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలో ఉన్న కార్యకర్తలు, నాయకులు, పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## సచివాలయం పరిశీలన

**వేపాడ:** మండలంలోని దబ్బిరాజుపేట సచివాలయాన్ని ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎంపిడిఒ పట్నాయక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి సచివాలయంలో ఉన్న పలు రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి స్పందనలో వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలని అన్నారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో బయటికి వెళ్తే కచ్చితంగా మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామంలో ఉన్న సర్పంచ్‌కు ఎంపిటిసికు అభివృద్ధి పనులపై వాళ్లకి ముందుగా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దనలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

**వేపాడ :** మండలంలోని గుడివాడ గ్రామంలో అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ గురువారం తన సిబ్బందితో కలిసి దాడి చేసి మద్యం అమ్ముతున్న రామునాయుడును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## యువతి అదృశ్యం

**బాడంగి:** మండలంలోని తెంటువలస గ్రామానికి చెందిన మార్పిన మహేశ్వరి (21) కనిపించడం లేదని ఆమె తల్లి సత్యవతి పోలీసులకు ఫిర్యాదుచేశారు. గత నెల రెండో తేదిన పొలానికి వెళ్తానని చెప్పి బయల్దేరిన మహేశ్వరి తిరిగి ఇంటికి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో ఆరాతీసినా ఆచూకీ కానరాలేదు. మహేశ్వరి ఆచూకీ తెలిసిన వారు 9121109455 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ జయంతి కోరారు.

# విద్యార్థులకు క'న్నీటి' వెతలు..

**ప్రజాశక్తి- మెరక ముడిదాం**

మండలంలోని గర్భాం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు నీటి కష్టాలు పడుతున్నారు. ఈ వసతి గృహంలో స్నానానికి, మరుగుదొడ్ల వినియోగానికి కూడా నీరు అందకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. తెల్లవారు జామునే స్నానానికి, మరుగుదొడ్ల వినియోగానికి కావాల్సిన నీటి కోసం మంచులో పక్కనే ఉన్న సచివాలయం ముందున్న పబ్లిక్ కుళాయి వద్ద క్యూ కడుతున్నారు. అది కూడా రోజు తప్పించి రోజు రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకేసారి నింపుకునేందుకు కూడా సదుపాయం లేకపోవడంతో అరకొర నీటితో ఇబ్బందులు పడుతున్నారు. తమకు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పబ్లిక్ కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థులు

# క్షయరోగులకు పౌష్టికాహారం పంపిణీ

**పూసపాటిరేగ :** క్షయ రోగులను దత్తత తీసుకొని వారికి కావాల్సిన పౌష్టికాహారం అందించడం బాధ్యతగా గుర్తిస్తున్నామని కుమిలి ఉప సర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి క్షయ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కుమిలిలో క్షయ రోగులను దత్తత తీసుకున్నారు. స్థానిక వెల్‌నెస్ సెంటర్ వద్ద రోగులకు పౌష్టికా హారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామంలో నలుగురు క్షయ వ్యాధి గ్రస్తులు ఉన్నట్లు రెల్లివలస ఆసుపత్రి వైద్యుల త్రివేణితో పాటు రాజ్‌కుమార్ తెలిపారన్నారు. రోగులను ఎవరైనా దత్తత తీసుకోవాలని తెలిపారన్నారు. వెంటనే తనతో పాటు డొంక దుర్గరాజు, మడిపల్లి రాజు స్పందించి దత్తత తీసుకోవ డానికి అంగీకరించామన్నారు. వారంతా వ్యాధి విముక్తి పొందినంత వరకూ వారికి ప్రతి నెలా బియ్యం, కందిపప్పు, నూనె, బాదంపప్పు, గుడ్లు లాంటి పౌష్టికాహారం అందించాలని వైద్యులు తెలిపారన్నారు. దానికి తాము సిద్ధపడి వారిని దత్తత తీసుకు న్నామన్నారు. అనంతరం ఎయిడ్స్‌డే సంద ర్భంగా ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ సూప ర్వైజర్ జి. పైడిరాజు, టిబి సూపర్‌వైజర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఆగోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తీర్ణత శాతం పెంచాలి

**రేగిడి :** పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే పెంచేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డిఇఒ ఎం. తిరుపతి నాయుడు సూచించారు. గురువారం సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ఉన్నత విద్య ప్రమాణాలు మెరుగుపరచుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల విద్య సామర్థ్యాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు మూల్యాంకాలను సంబంధించి ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే విద్యార్థులు వేసిన యోగాను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎంవి ప్రసాద్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## వాటర్ షెడ్ పనులు పరిశీలన

**మెరక ముడిదాం :** మండలంలోని వాటర్ షెడ్ పనులను జిల్లా డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి పరిశీలించారు. గురువారం సాయంత్రం ఆమె ఎపిఒ పెదప్పల నాయుడుతో కలసి బుధరాయ వలస పంచాయతీ పరిధిలో జరిగిన వాటర్ షెడ్ పనులను, పరిశీలించారు.

## 104 ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు

**వేపాడ :** మండలంలోని పాటూరులో బొద్దాం పిహెచ్‌సి ఆధ్వర్యంలో గురువారం 104 ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఎమ్‌డి ఎస్ సత్యకుమార్, ఏఎన్ఎం గౌరీ, లక్ష్మి,104 ఒసి సంతోష్ పాల్గొన్నారు.

## ఐరన్ మాత్రలు పంపిణీ

**భోగాపురం:** మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనత సమస్యలను అరికట్టేందుకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. గురువారం ప్రధానోపాధ్యాయులు వైద శ్రీరామ ఆధ్వర్యంలో విద్యార్థులు మాత్రలను వేసుకున్నారు. ప్రతి వారం విద్యార్థులకు ఒక ఐరన్ టాబ్లెట్ అందజేస్తామని, వైద్య పరీక్షలు నెలకోసారి నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులు మంచి పౌష్టిక ఆహారం తినాలని లేకపోతే వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉందని ఆయన సూచించారు.